శర్మ జానకిని ముద్దుపెట్టుకొన్న ఘట్టం

శర్మ పండితుడనీ, సంస్కృతం కూడా చదువుకొన్నాడనీ చెప్పాను!

జానకి సంగతి కూడా చెప్పాను!

ఆ అమ్మాయి దర్శనీయమైన రూపమునూ ప్రియమైన వాక్కునూ కలిగియున్నది.

అయితే నేం!

వ్రీడావతి

కొంచెం పెంకిపిల్ల!

ఆమె సాయంత్రం అయ్యేసరికి చక్కగా, అలంకరించుకుంటుంది. తల దువ్వకొని పూలు పెట్టుకుంటుంది. స్నిగ్ధమై, నిడుపై కోడెత్రాచులాగ నిగ నిగలాడుతూ ఉన్న ఆమె జడ పిరుదులపైన విలాసంగా ఊగుతూ నడచినప్పుడు కొద్దిగా లేస్తూ పడుతూ మహా రమణీయంగానూ దర్శనీయంగానూ ఉంటుంది.

అయితే ఏం లాభం?

ఆ జడను ఏ విధంగా కాముక క్రీడా వస్తువుగా ఉపయోగించాలో ఆ పిల్లకు తెలియదు. ఊరికే వ్రేలాడుతూ ఉండగానే సరా! శర్మకు తాకేలాగున జడను విసరాలె. ఆ జడను శర్మ కంఠసీమను పెనవెయ్యాలె. ఏదో అల్లాంటి తమాషాలు చెయ్యాలె.

ఇల్లాంటివి ఏవీ చేయకపోవటం వల్లనే శర్మ చాలా ఖిన్నుడై పోతున్నాడు.

శృంగార చేష్టలు ఆ పిల్లకు బొత్తిగా తెలియక పోవటం శోచనీయమైన విషయమే.

శర్మ అయినా ముందంజవేసి ఆ అమ్మాయిని లాలన చేసి తనకు వశం చేసికొనే శక్తి సామర్థ్యాలు లేనివాడు.

ఒక్కరోజున శర్మ ఆ అమ్మాయిని పట్టపగలే ముద్దు పెట్టుకోవలెనని నిశ్చయించుకొన్నాడు.

శర్మ తొందరపడి ఈ నిశ్చయానికి వచ్చినాడు అనటానికి వీలులేదు. అతడు

ఈ విషయమై పాపం చాలాసేపు ఆలోచించాడు. కామసూత్రాలు మొదలైన గ్రంథాలు ఎన్నో తిరగేసి, చివరకు అది అసంస్కృత వ్యాపారము కాదనీ, శాస్త్ర సమ్మతమైనదేననీ, కాముక వ్యాపారమే అయినా అనుపూర్విక విద్వత్సాంప్రదాయమేననీ, శాస్త్ర మర్యాద కలదేననీ నిశ్చయించాడు.

ఆ తరువాత ముద్దుపెట్టుకొనే విధానాలను గురించి తనకు దొరికిన సంస్కృత గ్రంథాలను తిరగేసి రెండు రకాల ముద్దులు తనకు నచ్చినవి ఏరి వాటిని గురించిన ప్రకరణం అంతా వ్రాసుకొని జాగ్రత్త చేసుకొన్నాడు.

ఆ రోజున ప్రొద్దుటనుంచీ గూడా అతడు ఆ ప్రయత్నంలోనే ఉన్నాడు. పెందలాడే స్నానం చేశాడు. ముఖానికి స్నో పూసుకొన్నాడు. తెల్లని ధోవతి కట్టుకొని పైన సన్నని గ్లాస్కో మల్లు చొక్కా తొడుక్కున్నాడు.

జానకి కూడా మామూలుగా సుస్నాతయై గులాబీ రంగు చీరగట్టి తెల్లని గ్లాస్కో మల్లు రెవిక తొడిగింది. ఆమె రెవిక చేతుల అంచులు జరీపేటుతో కుట్టబడి ఉన్నవి. ఆమె మెడలో నాల్గు వరుసల గొలుసు ఒకటి తళ తళా మెరసి పోతున్నది. మిగతా అలంకారాల విషయము మనకు అనవసరము. ఆమె ఆకర్షణీయంగా ఉందీ అని చెప్పటానికి ఇంతవరకు చాలు.

జానకి యొక్క కమనీయమైన ఆకృతిన్నీ, మధురమైన స్వరమున్నూ అతనిని ఎక్కువగా ఆకర్షించినవి. ఆమె దేహంపైనున్న రమణీయ సీమలనుతాకి ముద్దాడాలని అతనికి ఊహ కలగటంలో వైపరీత్యం ఏమీ లేదనే అనవచ్చు కాని కాస్త వెనకాముందూ చూడాలన్నారు పెద్దలు!

అందుకే శర్మ ఆమెను వెనకాముందూ కూడా చూశాడు. చూచి ఆమె శరీరంలో ఏ భాగం ముద్దెట్టుకోవలెనా అని ఆలోచించాడు.

వెనుకవైపు నుంచి కనపడుతూ ఉన్న ఆ బరువైన పిరుదులను గాని, శంఖంలాగ మనోహరమైన వంపులు గలిగి తెల్లగా నవనవలాడుతూ ఉన్న ఆమె కంఠసీమనుగాని ముద్దెట్టుకొందామని శర్మ అనుకొన్నట్లయితే చాలా బాగుండేది; ఇంత గ్రంథం జరక్కపోను.

కాని శర్మ చేసిన తప్పు ఏమిటీ అంటే స్నిగ్ధములై తళతళమెరుస్తూ తేలికగా పల్చగా ముట్టుకొంటే చితికిపోతయ్యా అన్నట్లు నీటి బుడగలలాగ ఉన్నటువంటి ఆమె బుగ్గలను మాత్రమే ముద్దెట్టుకోవాలని అనుకొన్నాడు.

ఇక్కడే శర్మ పొరబడ్డాడు కూడాను!

స్త్రీని ఎటువైపు నుంచి ముద్దాడాలన్న విషయంలో చాలా ప్రకరణాలు ఉన్నవి. ప్రాచీన అర్వాచీన పద్ధతులు భేదిస్తున్నవి. అయినా ఆ విషయమై అతడు అంతగా ఆలోచించకుండా ఉండవలసినది.

ఎందుకూ అంటే నిజమైన శృంగార మాధుర్యం తెలిసినవాడికి ప్రాక్ పశ్చిమాలు రెండూ ఒకటే! పూర్వార్థ ఉత్తరార్థ సీమలూ ఒకటే! అన్ని సౌందర్య సీమలూ కూడా చుంబనీయములే!

వదనమూ, కనుబొమ్మలూ, అధరమూ, నేత్రములూ, నుదురూ మొదలైన రమణీయ ప్రదేశములున్నూ, ప్రఫుల్ల పుష్ప పేశలత్వము కలిగిన కపోల నిమ్న భాగమున్నూ చుంబన చర్చకు చాలా అనుకూలములే. అయినప్పటికిన్నీ, వెనుక భాగం కూడా స్పర్శనీయంగానూ, శిరీషకుసుమ పేశలంగాను ఉన్నటువంటి సమయంలో దానితోనే సరిపెట్టుకొని ఆనందాన్ని పొందాలిగాని, తనకు లభ్యం కానటువంటి ఆ కపోలపాళినే ముద్దెట్టుకోవాలని పట్టుబట్టటం తెలివితక్కువతనమూ అని అనక తప్పదు.

అదీకాక,

ఆ అమ్మాయి ముగ్ధగాని ప్రౌఢ కాదుగదా! ఆ సంగతి శర్మ తెలుసుకోవలసింది. పండితుడు కదా, ఆ మాత్రం తెలుసుకోలేకపోయినాడేమి అని విచారం కలుగుతున్నది.

నిన్ను ముద్దెట్టుకుంటాను అని భర్త తన కోరికను తెలియజేయటంతోనే బుగ్గలు అందించి రెండు చేతులనూ అతని కంఠానికి పెనవేసి ప్రియుని సంతోషపెట్టాలనే విషయం ఆ అమ్మాయికి తెలియదు.

అల్లాంటప్పుడు శర్మ అయినా ఆ పిల్లకు ఎదురుగా వెళ్ళి ఆమె ముఖాన్ని గట్టిగా రెండు చేతులతో నొక్కిపట్టుకొని దగ్గరకు లాక్కొని ఠక్కున రెండు ముద్దులు పెట్టుకొని వదిలేసి తన పని మీద తాను వెళ్ళిపోవలసింది.

శర్మ అల్లాగ చెయ్యలేదు. చెయ్యమని చెప్పినా చెయ్యడు. అది అసంస్కృత వ్యాపారమనీ, అనార్య సాంప్రదాయమనీ, రాక్షసకృత్యమనీ అతని ఉద్దేశం.

బలవంతం లేకుండా మామూలుగానే ఆ అమ్మాయిని ముద్దెట్టుకొనేందుకు శర్మ నిశ్చయించాడు.

ఒక పురుషుడు ఒక స్త్రీని ముద్దెట్టుకోవాలె అంటే ముందు వారిద్దరూ ఒకరి కొకరు మిక్కిలి సమీపంలో ఉండటం సంభవించాలె.

ఇందులో మొదటిదే శర్మకు లభ్యం కాలేదు. ఒకవేళ జానకి సామీప్యం లభ్యం అయినా శర్మ ముద్దెట్టుకుంటూ ఉంటే ఆ పిల్ల ఊరుకోటం అనేది కలలో వార్త. ఈ విషయం శర్మకు తెలియకపోలేదు. అయినా ఆ కుఱ్ఱవాడు ఆ ప్రయత్నాలు మానలేదు.

"జానకీ! కొంచెం పాపటతీసి తలదువ్వుతావూ?" అని అడిగాడు శర్మ. తనకు పాపట తీస్తున్నప్పుడు ఆమె ముఖం తన ముఖానికి చేరువగా వస్తుందనీ, అప్పుడు చటుక్కున ముద్దెట్టుకోవచ్చుననీ శర్మ ఊహించాడు. ఈ ఊహ కొంచెం తెలివిగానే ఉంది.

జానకి కూడా సరేనని వచ్చింది శర్మ తల దువ్వటానికి. ఆమె వచ్చి అతని వెంట్రుకలకు నూనె రాసింది. ఆ సమయం శర్మకు ఏమీ అనుకూలించలేదు. అయినా శర్మ ధైర్యాన్ని కోల్పోలేదు.

ఇక పాపట తీసే సమయంలో ఆమె ముఖం తనకు అతి సమీపం అవుతుంది, అప్పుడు ఆమె బుగ్గలను ముద్దాడాలె అని నిశ్చయించుకొన్నాడు శర్మ.

ఈ ఊహ అతని తనువుపై పులకలు కలుగజేసింది కూడా. చాలా హర్షముతో ఆ సమయానికై నిరీక్షించాడు. కానీ ఆ పిల్ల ఏమి చేసిందీ అంటే కుడిచేత్తో దువ్వెన పట్టుకొన్నది. ఎడమచేత్తో ఆ అమ్మాయి, శర్మ చిరుగడ్డాన్ని, గట్టిగా నొక్కి పట్టుకొని మరీ తలదువ్వింది. ఇల్లాగ నొక్కి పట్టటం చేత శర్మ తలను ముందుకుగాని వెనక్కిగాని, పక్కలకు గాని తిప్పటానికి వీలులేకపోయింది. చూస్తూ ఉండగానే ఆ అమ్మాయి అతనికి తల దువ్వి బొట్టు కూడా పెట్టి వెళ్ళిపోయింది. శర్మ ఆమె ముఖ సౌందర్యాన్ని ముఖ్యంగా మామిడిచిగురులా ఉన్న ఆ పెదవులనూ ఉజ్జ్వలములైన ఆమె కపోలాలను

చూస్తూ ఉండిపోయినాడే కాని ఆమెను దగ్గరకు తీసికొని ముద్దుపెట్టుకోలేకపోయినాడు.

శర్మ నిజానికి మహామంచి అవకాశాన్ని పోగొట్టుకొన్నాడు. కాని అతన్ని ప్రత్యేకంగా నిందించీ ప్రయోజనం లేదు. మోహపరవశులైన వారి ప్రవర్తన ఎప్పుడూ అలాగే ఉంటుంది అనిగదా శాస్త్రము. ఒక సఖి విరహంలో పడి ప్రియా, ప్రియా అని విలపిస్తూ తన సన్నిధికి వచ్చిన ప్రియుణ్ణి పరిచయములేని దానివలె చూస్తున్నదట! "విరహేణ వికల హృదయా, విలపంతీదయత! దయతేతి ఆగతమపి తం సవిధే, పరిచయహీ నేన వీక్షతే బాలా–అనిగదా అన్నాడు.

సరే, ఆ సదవకాశం అల్లాగపోయింది. ఆ తరువాత మళ్ళీ ఇంకొక అదనుకోసం శర్మ ఆమె వెంట వెంట తిరిగాడు పిల్లిలాగా! ఏం కావాలండీ అని అడిగింది జానకి. శర్మ చెప్పకూడదూ, ఇల్లాగ నిన్ను ముద్దుపెట్టుకోవాలెనని కోరిక కలిగింది, ప్రసన్నురాలవు కావలసింది అని! అల్లా అడిగితే ఎల్లాగ ఉండేదో! శర్మకు గుండెనిబ్బరం లేదు. భయపడి పోయినాడు. ఆ పిల్లమటుకు ఏమంటుందేమిటి? ఏమన్నా అంటే శర్మ ఇల్లాగ చేయడం శాస్త్రసమ్మతమేనని శ్లోకాలు చదవలేడు కనకనా! ఇంతకూ ఆ మాట అనలేకపోయినాడు. పైగా ఏం కావాలని అడిగితే ఏమీ అక్కరలేదు, ఊరికేనే వచ్చాను అని అబద్ధం కూడా ఆడాడు. అబద్ధాలు ఆడవలసిన అవస్థ ఏమొచ్చింది నిజానికి అతని కర్మం కాకపోతే!

శర్మ తన గదిలోకి వెళ్ళిపోయినాడు. సంస్కృత పుస్తకాలు కొన్ని తిరగేశాడు. కాని తనను బాధిస్తూ ఉన్న సమస్యకు సమాధానం ఆ పుస్తకాలలో ఎక్కడా అతనికి దొరకలేదు. శర్మ పాపం దిగులుపడిపోయినాడు.

ఇక జానకి సంగతి ఎట్లాగుందీ అంటే ఆ అమ్మాయి ఇతని వంక చూడటమే మానేసింది. ఇప్పుడు ఏం జేయాలె!

శర్మ ఆలోచించి ఆలోచించి చివరకు ఒక పని చేశాడు. తన చొక్కాకు ఉన్న గుండీలు తీసి కిటికీలోనుంచి విసిరి అవతలకు పారేశాడు. పారవేసి ఏదో ఘనకార్యం చేసినవాడిలాగ చిరునవ్వు నవ్వుకొని వెంటనే కేక వేశాడు, "జానకీ చొక్కాకు గుండీలు లేకుండా ఎంతసేపు ఉండేది! వచ్చి ఇచ్చిపో!

ఆమె వచ్చి బీరువా తీసింది. అప్పుడు ఆమె వీపును గాని చేతులనుగాని

కంఠసీమను గాని చటుక్కున ముద్దెట్టుకొన్నట్లయితే తీరిపోయేది. ఆ పిల్ల అటు బీరువావైపు తిరిగి ఉన్నది కాబట్టి శర్మ ప్రయత్నాలు గమనించేది కూడా కాదు. కాని శర్మ అల్లాగ చెయ్యలేదు.

శర్మ అలాగ చేయకపోవటం ఎంచేతనూ అంటే అతనికి తోచక కాదు! తోచకేం! అనేకసార్లు వచ్చింది ఆ ఆలోచన. కాని అతడు ఆమె బుగ్గలనే ముద్దాడాలని పట్టుబట్టి భీష్మించుకు కూర్చున్నాడు ఆయెను!

అబ్బో! శర్మ ఊరికే కూర్చోలేదు. చాలాచాలా విషయాలు ఆలోచిస్తున్నాడు. ఆ అమ్మాయి తన బీరువాలో నుంచి గుండీలు తీసి తన చొక్కాకు అమరిస్తూ ఉన్నపుడు తాను అనుకొన్న శృంగారలీల జరపాలని అతని ఊహ!

అయితే ఆ పిల శర్మ దగ్గరకన్నా రాలేదు. బీరువాలో నుంచి గుండీలు తీసి దూరాన నుంచునే 'ఇవిగో తీసుకోండి' అని అతని ప్రక్కపై పడేసి ముసిముసినవ్వులు నవ్వుకొంటూ వెళ్ళిపోయింది.

ప్రతి విషయంలోనూ శర్మ ఇల్లాగ పరాజితుడు అవుతూ ఉన్నాడు. శర్మ మళ్ళీ ఆలోచించాడు. ఎట్లాగయినా సంస్కృతం చదువుకొన్న బిడ్డ కాబట్టి, ఇంకో ఉపాయం తోచింది. ఏదో కారణం కల్పించి, ఆ పిల్లను తన గదిలోకి రప్పించి ఏదో మాయచేసి తన కోరిక నెరవేర్చుకోవాలె. శర్మ ఏమీ తొందరపడలేదు. ఆ అమ్మాయి వచ్చిన తరువాత తను ఏ విధంగా నవ్వుతూ సమీపించవలసినదీ, ఏ విధంగా ఆ పిల్లను మంచి చేసుకోవలసిందీ అంతా ఆలోచించి ప్రకరణం అంతా నిబంధించుకొన్నాడు.

ప్రకరణం ప్రకారం ముందు తాను దీక్షగా చదువుకొంటున్నట్లు నటన చేయాలె. అందుకని పుస్తకం తీసి ముందు పెట్టుకొన్నాడు. ఏదో ఒక శ్లోకం పెద్దగా చదివాడు. ఎందుకూ అంత పెద్దగా చదవటం! తనలో తాను చదువుకొంటే పోదు! తెలియనివాళ్ళము మనము అల్లానే అనుకొంటాము కాని ఆ బుద్ధిమంతుని ఆలోచన వేరు. తనకు చదువుయందు ఉన్న దీక్షా అవీ జానకి గ్రహించాలని. గ్రహిస్తే గాని తాను నిర్ణయించుకొన్న ప్రకరణం నడవదు.

శర్మ శ్లోకాలు పెద్దగా చదవడం జానకి విన్నది. విని ఆ అమ్మాయి ముసిముసి నవ్వులు నవ్వుకొన్నది. ఏమి గ్రహించిందో ఏమో మరి!

శర్మా! ఒక్క మాట చెబుతాను. ఎందుకోయ్ నీ చదువంతా? ఆ శృంగార

శాకుంతలము అవతలపెట్టు! కాళిదాసు ఎంత మహాకవి అయినా, ఎంత శృంగారం ఒలకపోసినా ఆ నిముషంలో జానకి గులాబీ పెదవులపై దాగుడుమూతలాడుతూ ఉన్న చిరునగవు యొక్క సౌందర్య రమణీయకములను మించిన రమ్యసృష్టి చేయలేదు. గార్హస్థ్య పరమార్థమైన శృంగార విలాస సంపదను అంతా ఆ చిరునవ్వు ఒలకపోస్తున్నది. నీ జీవితం అంతా ఆ మధుర మనోహర మందహాసమునకు కారికలు వ్రాయటంలో గడుపుకోవయ్యా శర్మా.

సరే, అప్పుడేమయిందో చెప్పవలె!

శర్మ ఏవో రెండు మూడు శ్లోకాలు చదివి, చటుక్కున ఆగి వంట ఇంటివైపు ముఖం త్రిప్పి "ఓయ్ జానకీ, ఇటురా ఒకసారి" అని కేకవేశాడు.

'ఎందుకండీ మాటిమాటికి పిలుస్తారు... ఎందుకో చెప్పరాదూ?' అని అడిగింది జానకి.

ఎందుకేమిటి తెలియటం లేదూ? ఇక్కడికి వచ్చి చూడు.

ఏమిటండీ?

ఈ పిచ్చికలు కిచకిచలాడుతూ ఒకటే గోల! నన్ను చదువుకోనియ్యటం లేదు. ఒకసారి వచ్చి వాటిని బయటికి పంపిద్దూ!

జానకి వంట ఇంట్లోనే వుండి "ఈ పిచ్చికలకు వేళాపాళా తెలియదు. ఇప్పుడేం కిచకిచలు కాకపోయినా! పొండి, పొండి ఇష్, ఇష్" అన్నది అక్కడ నుంచే!

శర్మ ఉన్న గదిలోకి రానూ లేదూ ముఖం చూపించనూ లేదు.

శర్మ మరొకసారి ఖిన్నుడై పోయాడు. అతడు వేసుకొన్న పథకం అంతా పాడైపోయింది. అతనికి దుఃఖం కూడా వస్తున్నది.

ఓయి పిచ్చి శర్మా, ఇంత ప్రయాస పడనక్కరలేదోయీ, పోయిముద్దెట్టుకో. ఆ పిల్ల ఏమీ అనదు అని అతనికి చెప్పేవారు కూడా ఎవరూ లేకపోయినారు గదా, పాపం!

ఆ రోజున మామూలుగా భోజనాలు అయిపోయినయి.

శర్మ సరిగ్గా కడుపునిండా తిన్నాడని నేను అనను. అతడు ఆమె ముఖం వంక చూస్తూ "అయ్యో! లోకోత్తర సౌందర్యమును కలిగిన ఆమె ముఖమును దగ్గరకు తీసికొని నీటిబుడగలవలె తళతళ మెరుస్తూ ఉన్న ఆ బుగ్గలను ఒక్కసారి అయినా ముద్దుపెట్టుకోలేకపోతినిగదా అన్న విచారంతో అతడు అన్నము సరిగా తినలేదనే అనాలె.

శర్మ చాలా నిస్పృహ చెంది సాయంత్రం దాకా చూస్తూ ఊరుకొన్నాడు. ఆ అమ్మాయి సాయంత్రం తన జడ విప్పి నిలువుటద్దము ముందు నుంచుని తల దువ్వుకొంటున్నది. అప్పుడు మాత్రం ఇల్లాగ అనుకొన్నాడు.

"సాయంత్రము ఆకాశములో విహరించే మేఘముల చాటున ఉన్నటువంటి విద్యుత్కాంతులు ఈమె కళ్ళలో ఉన్నవి కదా! ఆహా! ఈమె కపోలపాళి ఎంత మనోహరంగా ఉన్నది! ఇది మంచి సమయము. ఈ సమయము జారవిడువకూడదు సుమా!

ఇంకొక విషయం కూడా అతనికి ఎక్కువ ధైర్యాన్ని ఇచ్చినది. ఏమిటీ అంటే ఆ సమయాన జానకి అద్దంవైపుకు తిరిగి ఉన్నది. తాను వెనుక నుంచి ఆమెకు తెలియకుండా సమీపించవచ్చును కూడా. ఇల్లాగ అనుకొని అతడు చాలా సంతృప్తినీ, హర్షమునూ పొందినాడు.

అయితే ఒక యిబ్బంది వచ్చింది.

శర్మ ఆమె కంట బడకుండా వెనుక భాగాన్నే సమీపించగలుగుతాడు గాని ముందు భాగాన్ని ఎల్లాగ సమీపించగలుగుతాడు!

అయితే శర్మ ఈ విషయమై ఆలోచించలేదు. అడుగులో అడుగు వేసుకొంటూ నడిచిపోతున్నాడు.

ఆ కుఱ్ఱవాడు అల్లాగ దొంగలాగ రావటం ఆ పిల్లకు అద్దంలో కనిపించింది. అతణ్ణి చాలా దగ్గరకు రానిచ్చి, ఆ పిల్ల గిరుక్కున తిరిగి 'ఏమిటిది, ఏమిటి, మీ అభిప్రాయం? అని తీవ్రంగా అడిగింది.

శర్మ ఇదీ సంగతి అని చెప్పేయకూడదూ! నోరుంటేగా! ఏమీ మాట్లాడకుండా,

ముసిముసినవ్వులు నవ్వుకొంటూ వెనక్కి వెనక్కి వెళ్ళి పేముకుర్చీలో కూలబడ్డాడు.

శర్మా! శర్మా! నీ కర్మం అల్లాగ ఉంటే ఎవరేమి చెయ్యగలరు!

తాను ముద్దుపెట్టుకోదల్చిన కపోలములు ఆమెకళ్ళ ముందు లేకుండా మరొక ప్రదేశంలో ఉంటే ఎంతో బాగుండేది కదా అనుకొంటాడు. శర్మ సృష్టిలోనే మార్పులు కోరుతున్నాడు. ఆ దెబ్బతో అతనికి సాయంత్రం దాకా ఏమీ తోచకుండా పోయింది.

శర్మ ఖిన్నుడైపోయినాడు. రాత్రి భోజనాలు అయిపోయినవి. పుచ్చపువ్వులాంటి వెన్నెల మహామనోహరంగా ఉంది.

జానకి ఆరుబయట వెన్నెలలో రెండు పక్కలు వేసి వాటిపైన తెల్లని దుప్పట్లు పరిచింది. మల్లెపూవులాంటి తెల్లని చీర కట్టుకొని జరీపేటుగల తెల్లని రెవిక తొడుక్కుని తలలో మల్లెపూలు పెట్టుకొని ఒక శయ్యపై పడుకొని ఉంది.

ఆ మనోహరమైన ఆ ఆకృతిని జూచి అతడు అనుకొన్నాడు. "ఆహా, ఈ వెన్నెలలో ఈమె రూపం ఎంతో మహరమణీయంగా ఉంది సుమా!"

కొంచెం సేపు శర్మ ఆమెను తదేకనిష్టతో శ్రద్ధతో చూశాడు.

అరుణ రాగయుక్తమైన ఆ లలిత మృదుల మధురాధరమునూ, వెన్నెలను తినేస్తున్న ఆమె కపోలాలనూ, తదితర సీమలనూ చూచి శర్మ గుటకలు మ్రింగి తాను చేసిన ప్రతిజ్ఞను జ్ఞాపకం తెచ్చుకొని, కాలవిలంబనం ఏమాత్రమూ చెయ్యకూడదూ అనే నిశ్చయంతో, శర్మ శయ్యను సమీపించినాడు.

ఆమె కన్నులు మూసుకొని వున్నది. నిద్రావశురాలయ్యో లేక త్రపాపారవశ్యాన్నో చెప్పలేము కదా!

ఆ నిముషమునుండీ శర్మ చేసినవన్నీ పొరపాట్లే! బాహ్యేంద్రియ వ్యాపారాన్ని బట్టి ఆమె సుషుప్త్యవస్థ యందు ఉన్నట్లు భావించాడు. కాని నిజానికి ఆమె నిద్రపోవటమే లేదు. శర్మను ఒక కంటితో కనిపెడుతూనే ఉంది.

ఆ పిల్ల నిద్రపోతూ ఉన్నదా లేదా అన్న సందేహము శర్మకు కలిగినట్లే ఉంది, లేకపోతే అతడంత మెల్లగా నడవవలసిన అగత్యం ఏమీ లేదు కదా!

అయితే మెల్లగా నడిస్తే తాను వస్తూ ఉన్నట్లు ఆ పిల్ల గ్రహించలేదు అనుకోటం పొరపాటు. ఆ పిల్ల ఈ కుఱ్ఱవాడు రావటం ఓరగంట కనిపెట్టి నవ్వును ఆపుకొంటున్నది. కాని ఆ నవ్వు ఆమె పెదువులలోనుంచి తొంగిచూస్తూ ఉన్నది. మందస్మిత వదనయైయున్న కారణాన ఆ వనిత తాను చేయబోయే చుంబన సంస్కారానికి సుముఖ అయి ఉన్నది అనుకోవటం రెండవ పొరపాటు.

ఈ పొరపాట్లు అన్నీ ఎందుకు చేస్తున్నాడూ అంటే అతనికి పిచ్చి ఎక్కుతున్నదేమోనని నాకు అనుమానంగా ఉంది.

ఎందుకూ అంటే, మొదట్లో ఆమె బుగ్గలు మాత్రమే ముద్దెట్టుకోవలెనని అనుకొన్న శర్మ ఇప్పుడు ఆమె అధరోష్ఠమునూ నేత్రాలనూ కూడా ముద్దుపెట్టుకొందామనే కాక సౌందర్య సీమలను అన్నిటిని కూడా కరతల పరామర్శ చెయ్యాలని ఊహిస్తున్నాడు.

ప్రొద్దుటినుండీ ఎంత ప్రయత్నం చేసినా ఆమె బుగ్గలలో ఒక్కదానినైనా ముద్దుపెట్టుకోలేక పోయిన ఈ ధీరుడు అమాంతంగా ఆ క్షణంలో అవీ, ఇవీ ముద్దెట్టుకోవాలని కోరుకోవటం తెలివితక్కువతనం కాక మరేమిటి! కామాసక్తుడికి సాధ్యమూ అసాధ్యము అనే జ్ఞానం ఉండదు కాబోలు!

శర్మ అల్లాగ అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్ళుతూ ఉన్నప్పుడే అనుమానం కలిగింది. ఆ అమ్మాయి మేల్కొని ఉన్నదేమోనని. మేల్కొనే, ఉన్నట్లయితే ఆ అమ్మాయి తనను ముద్దుపెట్టుకోనివ్వదు. కాని ఎట్లా! ఆ అమ్మాయి బుగ్గలు మిలమిలా మెరిసిపోతున్నవి! ముద్దుపెట్టుకోక తప్పదు! అయితే తాను తీరా వంగి ఆమె బుగ్గలను ముద్దాడబోయే సమయానికి ఆ పిల్ల ఏం చేస్తుందో! ముఖం కాస్తా తిప్పేసుకుంటుందేమో!

ఆలోచించి, ఆలోచించి చివరకు ఏమైనా కానీయమని శర్మ బెరుకు బెరుగ్గానే వెళ్ళి ఆమె ప్రక్కలో కూర్చున్నాడు.

ఆ పిల్ల యోగ్యురాలున్నూ, సుగుణవతిన్నీ, లజ్జా వినమ్రయీ, అయిన కారణాన శర్మ బ్రతికిపోయినాడు. జానకి ఏమీ అనలేదు.

శర్మకు ఎక్కడ లేని ధైర్యమూ వచ్చింది. ఇక ముద్దు పెట్టుకొందామని అనుకొంటూ ఉండగా అతనికి ఒక ఆలోచన వచ్చింది.

అది ఏమిటీ అంటే, ఆ పిల్ల నిద్దురపోతున్నట్లు నటిస్తున్నమాట నిజమేనా అని! నటన అయితే వచ్చిన ఇబ్బంది ఏమీ లేదు కాని నిజంగా నిద్రపోతూ ఉంటే మాత్రం ఆ అమ్మాయిని ముద్దుపెట్టుకోకూడదు. అది శాస్త్ర సమ్మతం కాదు.

అందుచేత శర్మ ఈ విషయమై తనలో తానే తర్కించుకొని ఆ పిల్ల నిద్రపోవటం లేదు అనే నిశ్చయానికే వచ్చాడు.

శర్మ తెలివితక్కువవాడే అయినా ఆ వధువు మధ్య మధ్య కొద్దిగా కళ్ళు తెరుస్తూ మూస్తూ ఉండడం కనిపెట్టలేనంత తెలివి తక్కువవాడు మాత్రం కాదు.

అయితే ఇప్పుడు మరియొక సమస్య వచ్చింది. ఆ పిల్ల చూస్తూ ఉండగా ముద్దుపెట్టుకోవడం ఎల్లాగ! తన అభీష్టానికి ప్రొద్దుగూకులూ విముఖత్వం చూపినపిల్ల, ఇప్పుడు సుముఖత్వం చూపుతుందని నమ్మకం ఏమిటి!

శర్మ మళ్ళీ ఆలోచించవలసి వచ్చింది. ఆలోచించి ఆ పిల్ల చూస్తూ ఉండగా తాను ముద్దుపెట్టుకొనే ప్రయత్నం చెయ్యకూడదనీ, ఆమె కళ్ళపడకుండా ఈ చమత్కారం చెయ్యాలనీ శర్మ నిశ్చయం చేసుకొన్నాడు.

ఆ పిల్ల కళ్ళపడకుండా ఈ మధురానుభవాన్ని పొందటం ఎల్లాగా అని శర్మ ఆలోచించి రెండు మూడు శ్లోకాలు జ్ఞాపకం తెచ్చుకొని అర్థాన్ని సమన్వయ పరచుకొని చివరకు ఒక పంథా తొక్కటానికి కృతనిశ్చయుడైనాడు.

అప్పుడు శర్మ ఏమి చేశాడూ అంటే కూర్చున్నవాడు కూర్చున్నట్లుగా ఉండి తన రెండు చేతులతోనూ ఆ ముగ్ధ బాలిక యొక్క రెండు కళ్ళు కూడా గట్టిగా మూసి వేగిరపాటుతో ఆ పులకిత తన్విని, ఆ సుందరాంగిని, ఆ ముగ్ధ బాలికను, ఆ సమధిక లజ్జావతిని పదే పదే ముద్దుపెట్టుకొన్నాడు.

అయితే శర్మ రోజురోజంతా కూడా ముద్దుపెట్టుకొంటానికి ప్రయత్నం చేసినా ఏ మాత్రమూ వీలుకల్పించని జానకి చివరకు ఇల్లాగ మెత్తపడి మాట్లాడకుండా ఎందుకు ఊరుకొన్నదీ అనే ప్రశ్న రాకమానదు.

దానికి సమాధానం ఏమిటీ అంటే ఇల్లాగ వేగిరపాటుతో చుంబనార్చన చేస్తూ ఉన్న సంగతి ఆ పిల్లకు తెలియదనే నాకు నమ్మకం. ఎందుకూ అంటే ఆ పిల్లకు

కళ్ళకు కనపడుతూ ఉన్నదానినే చూడలేనటువంటిన్నీ, చెవులకు వినిపిస్తూ ఉన్న దానినే వినలేనటువంటిన్నీ స్థితిలో ఉన్నది. అంతవరకు నేను గట్టిగా చెప్పగలను.

ఇల్లాగ ఉన్న కారణానో లేక నా కళ్ళతో నేను చూడని విషయంలో నేను ఎందుకు జోక్యం కలుగజేసుకొనవలయునని అనుకొన్నదో ఏమో ఆ పిల్ల కొంచెం సేపు వరకూ కదలకుండా మెదలకుండా ఊరుకొనటం జరిగి ఉంటుంది.

కళ్ళు గట్టిగా మూయబడిన కారణాన ఆ చుంబన సంస్కృత వనిత ఏమీ చూడలేదు. చూడలేదు కాబట్టి ఏమీ అనలేదు. ఆ పిల్ల మెదలకుండా ఊరుకొనటానికి ఇదే కారణం అయి ఉంటుంది.

శర్మ అయినా తెలివిగల పనిచేశాడు. అల్లా చెయ్యాలని తోచినందులకు అతనిని అభినందించాలని ఉన్నది. సంస్కృతంలో ఉన్న శృంగార రస ప్రధానమైన కావ్యాలు చదవంగానే సరా! ఇల్లాగ ఆ జ్ఞానం జీవితానికి వెలుగు అయి ప్రసరించటమే చాలా గొప్ప విషయము.

అతడు గనుక ఆ పిల్ల కళ్ళు అల్లాగ మూయకపోయినట్లయితే ఈ వ్యవహారం చాలాదాకా పోయేది!

ఇంతవరకూ శర్మ అదృష్టవంతుడూ అని అనవలసిందే!

శర్మ చాలా తృప్తినీ ఆనందాన్ని పొందినవాడైనాడు అతడు,

స్వేదాంబు సాంద్ర కణశాలి కపోలపాలి
డోలాయత శ్రవణ కుండల వందనీయా
ఆనంద మంకుర యతి స్మరణేన కాసి
రమ్యాదశౌ మనసి మే మదిరేక్షణాయాః

స్వేదోదక సాంద్ర కణములతో శోభిస్తూ ఉన్న కపోలపాలిపై, అటూ ఇటూ కదులుతూ ఉన్నటువంటి శ్రవణ కుండలములచేత శ్లాఘింపతగిన, చెప్పటానికి శక్యముగాని ఆ మదిరేక్షణ యొక్క ఒకానొక మనోహరదశ మనస్సులో స్మరణ చేయగా ఆనందము అంకురిస్తూ ఉన్నది సుమా అని శ్లోకమూ తాత్పర్యమూ కూడా రాగవరుసతో చదువుతూ ఆ పర్యంకము పైన జానకి ప్రక్కనే ఏమీ తెలియని తన్మయస్థితిలో పడినాడు శర్మ!

సరే, జరగవలసిన పని జరిగింది. శర్మ పట్టుబట్టి ఆనా కపోలాలనే

ముద్దెట్టుకోగలిగినాడు. కాని అది జరగవలసిన శాస్త్రీయ పద్ధతిలో జరగలేదు.

శర్మ ఈ చుంబన క్రీడను గురించి చాలా చదివినాడనీ కొన్ని ప్రకరణాలు వివరంగా వ్రాసిపెట్టుకొన్నాడని చెప్పినాను. ఆ మాటనిజమే. కాని సమయానికి ఆ ప్రకరణం జ్ఞాపకం రాని కారణానో మరే కారణం చేతనో ఆ సంస్కారం జరుగవలసిన ప్రకరణంలో జరగులేదు.

ఈ విషయము నిరూపించటానికి ఒక్క విషయము చూపుతాను. జానకి ముగ్ధ. సమధిక లజ్జావతి. నాయిక ముగ్ధ అయినపుడు ప్రణయకోపం పట్టవలె ముందు. తదనంతరం చుంబన సంస్కారం జరగాలె. జానకి ప్రణయ కోపం పట్టకముందే శర్మ ఆ అమ్మాయిని తొందరపడి ముద్దెట్టుకొన్నాడు.

ఆ పిల్ల కూడా ఈ అశాస్త్రీయ పద్ధతికి కొంతవరకు బాధ్యురాలే. 'పాటలాధర మరందాస్వాద సమ్మర్థముందాళం జాలదు' అని పద్యంలో ఉన్నది కదా! కుఁయ్ కై అనకుండా ఆ పిల్లమటుకు ఎందుకు ఊరుకోవాలె.

ఆ పిల్లకు ఏమీ తెలియదు. సంస్కృతం చదువుకోలేదు. కాబట్టి శర్మే ఈ లక్ష్యాన్ని మనస్సు నందు ఉంచుకొని తదనుగుణ్యంగా ప్రవర్తించవలసింది. అదొక్కటే విచారింపతగిన విషయము.

ఈ జానకీ విలాసంలో ఇప్పుడు చెప్పబడిన వృత్తాంతం వల్ల మనము నేర్చుకోదగిన విషయము ఒకటి ఉన్నది.

అది ఏమిటీ అంటే, గృహిణి కపోలపాళినే ముద్దు పెట్టుకోవలెనని పట్టుబట్టి కూర్చోకూడదూ అనీ, ఆ పవిత్ర మూర్తి సుకుమార సుందర విగ్రహానికి చెందిన సౌందర్యసీమలూ అన్నీ అనగా శిరస్సు నుంచి శ్రీపాదం వరకూ ప్రతి భాగమూ కూడా పవిత్రమూ మృదుమధురమూ ప్రేక్షనీయమూ వందనీయమూ అనిన్నీ, ముఖాంబుజము మొదలు పాదాంబుజములవరకూ పూజార్హమనీ ప్రతి యువకుడు తెలిసికోవలసి ఉంది.

విశ్వశ్రేయః కావ్యం - అన్నాడు. నేను ఈ మాట చెపుతున్నాను.

శర్మ జానకిని ముద్దుపెట్టుకొన్న ఘట్టము ఇంతటితో ఈ విధంగా సమాప్తం అయింది.

(మే, 1955)